క్లుప్తంగా

ప్రశాంతంగా జీవించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

మంత్రాలయం: గ్రామాల్లోని ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయరాదని, రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వివిధ పథకాలను అమలుచేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళల రక్షణలో భాగంగా దిశ యాప్‌తో పాటు మహిళా పోలీస్ స్టేషన్‌లను కుడా ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు.

శ్రీమఠంలో హైకోర్టు న్యాయమూర్తి

మంత్రాలయం: పరమ గురువు రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి రాజశేఖర్‌రావు సతీసమేతంగా ఆదివారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టారు. అనంతరం రాఘవేంద్రుల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తుది దశలో గ్రంథాలయ భవన నిర్మాణం


కోసిగిలో గ్రంథాలయ భవన నిర్మాణం

కోసిగి: స్థానిక సంత మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సంసిద్ధం చేస్తున్నారు. జిల్లా గ్రంథాలయ నిధులు రూ.16 లక్షలతో నూతనంగా గ్రంథాలయ భవనం నిర్మించారు. ప్రస్తుతం కాంపౌండ్ వాల్, బాత్ రూమ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. త్వరలోనే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు గ్రంథాలయ అధికారి దుల్లయ్య తెలిపారు. ఇన్నాళ్లు గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతూ ప్రజలు, పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇకపై అలాంటి ఇబ్బందులు లేకుండా సొంత గ్రంథాలయ భవనంలో అన్ని రకాల పాఠ్యపుస్తకాలు, నవలలు, సాహిత్య, తదితర పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోనిఅర్బన్: భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక శ్రీనివాసభవన్ సర్కిల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ తెలిపారు. ఆ పార్టీ నాయకులు రక్తదానం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్ (62) రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు ప్రకాష్‌జైన్, మలేకర్ శ్రీనివాస్, శ్రీనివాస ఆచారి, నాగరాజుగౌడ్, మమత లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఆదోనిఅర్బన్: పత్తికొండకు చెందిన ఉమాపతి (63) అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో గత నెల 29వ తేదీన గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు. ఆదివారం కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలియజేశారు. కేసు నమోదు చేసుకొని, పత్తికొండకు రెఫర్ చేసినట్లు చెప్పారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఎమ్మిగనూరురూరల్: కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి చికిత్స పొందుతూ శెట్టిబలిజ నాగేంద్ర (26) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాలు.. మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామానికి చెందిన నాగేంద్రకు భార్య సుజాత, కుమార్తె రేవతి, కుమారుడు శేఖర్ ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. రెండేళ్ల నుంచి మద్యానికి బానిస అయ్యాడు. మద్యం తాగడానికి, సంసారానికి అప్పులు పుట్టుక సెప్టెంబర్ 29వ తేదీన పురుగు మందుతాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఏఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు.

శ్రమదానం.. స్వచ్ఛతే లక్ష్యం


ఆదోనిలో రోడ్డును చీపురుతో శుభ్రం చేస్తున్న వెల్లాల మధుసూదనశర్మ, నాయకులు


విరుపాపురంలో రోడ్లను శుభ్రం చేస్తున్న జెడ్పీటీసీ అరుణమ్మ, సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ తదితరులు


కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఆదోనిఅర్బన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదన శర్మ పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో సంవత్సరంలో అడుగుపెడుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆదోని మున్సిపల్ పరిధిలోని 35వ వార్డు పంజరాపోల్ కాలనీలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెల్లాల మధుసూదనశర్మ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కాలనీ మహిళలు, యువకులు పాల్గొని శ్రమదానం చేశారు. ఇంటింటికీ వెళ్లి స్వచ్ఛభారత్ కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరి చేరవన్నారు. వార్డుల పరిధిలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యేకు తెలియజేసి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ శానిటేషన్ సూపర్‌వైజర్ శివ, సచివాలయ శానిటరీ సెక్రటరీలు శ్రీనివాస్, హరిత, వైఎస్సార్‌సీపీ నాయకులు కురువ రవికుమార్, అగ్గిరాముడు, సులోచనమ్మ, సుజాతమ్మ, షేక్షావలి, రాము, లక్ష్మన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ మండిగిరిలో ఎంపీడీఓ గీతావాణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది చీపురు చేతపట్టి రోడ్లను శుభ్రం చేశారు. చెత్తను చెత్తబండిలో వేసి డంపింగ్ యార్డుకు తరలించారు. అలాగే విరుపాపురం గ్రామంలో జెడ్పీటీసీ అరుణమ్మ, గ్రామ సర్పంచ్ ప్రహ్లాదయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది, వలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని రోడ్లను, డ్రెయినేజీ కాలువలను శుభ్రం చేశారు.

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. వారు మాట్లాడుతూ.. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే రోగాలు బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల అవరణం, పరిసరాలను శుభ్రపరిచారు. ఎన్‌సీసీ అధ్యాపకుడు గోవిందు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించండి


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కౌతాళం: ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు తక్షణమే బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పరిషపోగు శ్రీనివాసరావు, నవ్యాంధ్ర బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు కోరారు. ఆదివారం మండల పరిధిలోని ఏరిగేరి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా హరిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా భరత్, ఏరిగేరి గ్రామ అధ్యక్షుడిగా శాంతరాజు, మండల కమిటీ సభ్యులతో పాటు ఏరిగేరి గ్రామ కమిటీ సభ్యుల్ని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాదిగలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మంత్రాలయం: మండల పరిధిలోని వి.తిమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి సోమవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి హాజరుకానున్నట్లు గ్రామ సర్పంచ్ వీరారెడ్డి తెలిపారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అలసందగుత్తి కేసులో 15 మంది అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో గత నెలలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడులు చేసిన విషయం విధితమే. ఈ కేసులో రెండు వర్గాల వారిపై కేసులు నమోదయ్యాయి. ఆదివారం ఈ కేసుకు సంబంధించి 15 మందిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. రామాంజనేయులు, వెంకటేష్‌తో పాటు మరో 13 మందిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. అలాగే గ్రామంలో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రశాంతమైన గ్రామంలో అల్లర్లు, గొడవలకు దిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

టీడీపీ విషప్రచారం మానుకోవాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్: కోట్లాది రూపాయల ప్రజాధనం కొల్లగొట్టి సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికిపోవడంతో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు మద్దతుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వంపై విషప్రచారం చేయడాన్ని మానుకోవాలని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, సీనియర్ నాయకుడు సింహం నాగేంద్ర హితవు పలికారు. కుంభకోణాల్లో ఇరుక్కుపోయి రిమాండ్‌లో ఉన్న బాబుకు ఒత్తాసు పలుకుతూ ఉనికిని కాపాడుకునేందుకు ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేయడం తగదన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టి అడ్డంగా దొరికిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. 2014 నుంచి 2019 వరకు పోలవరం ప్రాజెక్టు వ్యవహారంలో నాటి కేంద్ర ప్రభుత్వం బీజేపీతో పొత్తు పెట్టుకొని కోట్లకు కోట్లు కొల్లగొట్టిన సంగతి మరిచారా అంటూ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, పార్టీపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నాయకులు తాయన్న, ఆంధ్రా లక్ష్మన్న పాల్గొన్నారు.

చౌడేశ్వరి జ్యోతి మహోత్సవాలకు వేళాయె


పూజలందుకుంటున్న చౌడేశ్వరి అమ్మవారు

పత్తికొండ రూరల్: పట్టణంలోని రెడ్డిబావి వీధిలో కొలువైన చౌడేశ్వరీ మాత భక్తుల పాలిట ఆరాధ్యదైవంగా విరాజిల్లుతుంది. వీధిలో 1862లో తవ్వకాలు జరుపుతుండగా లభ్యమైన బచ్చన చౌడమ్మ విగ్రహానికి 161 ఏళ్లుగా పూజలందుకున్న చౌడమ్మ ప్రతిమ రూపంలో 39 ఏళ్ల కిందట భక్తులు విగ్రహ ప్రతిష్ఠ గావించారు. కొలిచిన వారికి కొంగుబంగారంగా చౌడేశ్వరీమాత భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటోం. తొగట వీరక్షత్రియుల కులదైవమైన చౌడేశ్వరి దేవి తమను ఎప్పుడూ చల్లంగా చూస్తుందని భక్తుల విశ్వాసం. ఏటా మహాలయ పౌర్ణిమ రోజున చౌడేశ్వరీ దేవికి రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తారు. భాద్రపద మాస పౌర్ణిమ తరువాత వచ్చే మంగళవారం తెల్లవారుజామున అమ్మవారి జ్యోతుల మహోత్సవం రోజునే ఇక్కడి ప్రాంతవాసులంతా మహాలయ పౌర్ణమిను జరుపుకోవడం ఆనవాయితీ.

పల్లకీ అమ్మవారి ప్రత్యేకత

ఇక్కడి పల్లకీ అమ్మవారికి ఓ విశిష్టత ఉంది. ఎవరైనా ఆలయానికి వచ్చి మనసులో అనుకున్న కోరిక నెరవేరితే అందుకు సంబంధించిన మొక్కుబడిని తీర్చుకునేందుకు అమ్మవారే వారి ఇంటికి వెళ్లడం విశేషం. వారు ఏది చెల్లిస్తామని మనసులో అనుకుంటే దాన్ని చెల్లించేంత వరకు అక్కడి నుంచి ముందుకు వెళ్లరని భక్తుల ప్రగాఢమైన నమ్మకం. ఇదే తరహాలో ఏటా అమ్మవారు పల్లకీలో భక్తుల ఇంటికి వెళ్లగా వివిధ కానుకలు మొక్కుబడులను చెల్లించుకుంటారు.

చౌడేశ్వరీ దేవి పూజల వివరాలు

ఆలయంలో 2వ తేదీన ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకం, అర్చన, పూజాకార్యక్రమములు మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం. సాయంత్రం 5 గంటలకు పూజా కార్యక్రమం, రాత్రి 7 గంటలకు గణం, గంగపూజ, 8 గంటలకు మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ. 3న తెల్లవారుజామున 3 గంటల నుంచి 8.30 గంటల వరకు జ్యోతుల మహోత్సవం సందర్భంగా అమ్మవారి పల్లకీఊరేగింపు ఉంటుంది. తరువాత ప్రత్యేక పూజలు మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జ్యోతుల మహోత్సవం కార్యక్రమం సాగుతుందిలా

3వ తేదీన తెల్లవారుజామున 3 గంటల నుంచి 8.30 గంటల వరకు తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో చౌడేశ్వరీ దేవి జ్యోతుల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంట బయలుదేరిన జ్యోతులు పోలీసు స్టేషన్ మీదుగా ఆలయానికి చేరుకుంటాయి. జ్యోతుల మహోత్సవానికి అనంతపురం జిల్లా తాడిపత్రి, యాడికి, చిన్నపడమల, కర్నూలు జిల్లా వెలుగోడు, ఆత్మకూరు ప్రాంతాల నుంచి వందలాది భజన బృందాలు పాల్గొంటాయి. ఉత్సవాల సందర్భంగా గుంతకల్లు, ఆదోని, గుత్తి, కర్నూలు, డోన్ తదితర పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు రెండు రోజులు ముందుగానే పత్తికొండకు చేరుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన నరేష్‌ను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం యువకుడికి గాయాలయ్యాయి. వివరాలు.. మంత్రాలయం మండలం చెట్నేహళ్లికి చెందిన నరేష్, సురేష్ బైక్‌పై నాగలదిన్నెకు బయలుదేరారు. జొహరాపురం దాటిన తరువాత దేవుడి మాన్యం వద్ద చెట్టుపై తెగి పడి ఉన్న విద్యుత్ వైర్లు గాలికి వీరి బైక్‌కు అడ్డం పడ్డాయి. నరేష్ బైక్ నడుపుతుండగా గొంతుకు విద్యుత్ వైరు అడ్డం పడడంతో అదుపుతప్పి కింద పడ్డారు. గొంతు, ఎడమ చేతికి, నడుముకు గాయాలయ్యాయి. వెనుక కుర్చున సురేష్‌కు తల వెనుక భాగంలో స్వల్ప గాయమైంది. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ


గోపాల్ రెడ్డికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ మహేశ్

ఆదోనిటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గత రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న 5వ వార్డు సచివాలయం పరిధిలోని క్లస్టర్ 15కు చెందిన వలంటీర్ మహేశ్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి గోపాల్‌రెడ్డికి పింఛన్‌ను అందజేసి మానవత్వం చాటుకున్నాడు. వలంటీర్ ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందజేయడంతో గోపాల్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రతిఒక్కరికీ మేలు జరుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ

ఆదోనిరూరల్: పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మాల శేఖప్పకు ఆదివారం పెద్దహరివాణం గ్రామ వలంటీర్ పరమేష్ కర్నూలుకు వెళ్లి పింఛన్‌ను అందజేశారు. పింఛన్ అందుకున్న మాల శేఖప్ప వలంటీర్ సేవలను కొనియాడారు. తాము ఉన్న చోటుకే వచ్చి పింఛన్ అందజేయడం సంతోషంగా ఉందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ సేవలు అభినందనీయమన్నారు.


శేఖప్పకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ పరమేష్

గ్రామాలను శుభ్రంగా ఉంచుకుందాం


మంత్రాలయంలో వీధులను శుభ్రం చేస్తున్న నాయకులు, అధికారులు


కౌతాళంలో రోడ్లను శుభ్ర పరుస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


కోసిగి ఆర్టీసీ బస్టాండ్‌లో చీపురు పట్టి శుభ్రం చేస్తున్న సర్పంచ్ అయ్యమ్మ


పెద్దకడబూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: ప్రతి గ్రామం స్వచ్ఛంగా ఉండాలని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, బాపురం సర్పంచ్ శిల్ప, కుంటనహాల్ సర్పంచ్ పార్వతమ్మ అన్నారు. ఆదివారం ఆయా గ్రామాల్లో స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. కౌతాళంలో కార్యదర్శి చెన్నయ్య, సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు బస్టాండ్ ప్రాంతంలో రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామం శుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం స్థానిక ఆదోని రోడ్డులో ఇరువైపులా సిమెంటు రోడ్డుకు ఆక్రమించుకున్న ముళ్ల కంపలను జేసీబీతో తొలగించారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే కుంటనహాల్ గ్రామంలో గ్రామ ఇన్‌చార్జ్ శివరాం, కార్యదర్శి నగేష్ ఆధ్వర్యంలో ఆదోని రోడ్డులో చెత్త కుప్పలను తొలగించి శుభ్రం చేశారు. గ్రామంలో చెత్తచెదారం తొలగించి రోడ్లను ఊడ్చారు. బాపురంలో రోడ్లను ఊడ్చడమే గాక పాఠశాల ఆవరణలో గ్రామ ఇన్‌చార్జి గురునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ప్రతి ఇంటికో మొక్క నాటుకోవాలని పిలుపునిచ్చారు.

మంత్రాలయం: మంత్రాలయంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, డీఎల్‌పీఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ మణిమంజరి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జీపీ కార్యాలయం నుంచి శ్రీమఠం ముఖద్వారం మీదుగా మంచాలమ్మ పాదాల వరకు వీధులను శుభ్రం చేసి చెత్త చెదారం తొలగించారు. ఈఓపీఆర్డీ ప్రభావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూప, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచ్ పరమేష్, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టి నాయకులు జనార్దన్‌రెడ్డి, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అయ్యమ్మ, ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కోసిగిలోని సంత మార్కెట్, వైఎస్సార్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చీపురు పట్టి చెత్తను తొలగించారు. చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో డంపింగ్‌యార్డుకు తరలించారు. అలాగే కందుకూరు గ్రామంలో జెడ్పీటీసీ సభ్యులు పవిత్ర పాటిల్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. సాతనూరు, అగసనూరు, సజ్జలగుడ్డం, చింతకుంట, ఆర్లబండ, కొల్మాన్‌పేట, వందగల్లు తదితర గ్రామాల్లో సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

పెద్దకడబూరు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టి రోడ్లు, పంచాయతీ, పాఠశాలల ఆవరణ, ప్రధాన రోడ్లను శుభ్రపరిచారు. వైస్ సర్పంచ్ విజయేంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రవిచంద్రరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

కౌతాళం: మేజర్ పంచాయతీ గ్రామసభను సోమవారం నిర్వహించనున్నట్లు కార్యదర్శి చెన్నయ్య తెలిపారు. సర్పంచ్ పాల్‌దినకర్, ఈఓపీఆర్‌డీ జనార్థన్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామసభలో వార్షిక ఆడిట్ నివేదిక, గత సంవత్సరం పరిపాలన నివేదిక, 15వ ఆర్థిక సంఘం, ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ సంచాయతీ నిధులతో చేపడుతున్న పనుల పురోగతి, గ్రామ పంచాయతీలో 2023–24 సంవత్సరపు అంచనా బడ్జెట్, పన్నులు, ఫీజులు బకాయి పడ్డవారి వివరాలు, స్వైన్ ఫ్లూ, డెంగ్యూ, చికన్ గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తం చేయడం, శానిటేషన్, నీటి సమస్యపై చర్చించనున్నారు. గ్రామప్రజలు, వార్డు మెంబర్లు హాజరుకావాలని కోరారు.

మున్సిపల్ హైస్కూళ్లు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో మరో రెండు పురపాలక ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి.నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ పట్టణ అధ్యక్షులు రవి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పట్టణంలో 4 పురపాలక ఉన్నత పాఠశాలలు ఉన్నాయని శివారు ప్రాంతాలైన రాయనగర్, మాసమసీదు, రాజా రాజేశ్వరి నగర్, హనుమాన్ నగర్, కిల్చిన్‌పేట, బోయగేరి, వాల్మీకీనగర్, ప్రశాంత్ నగర్ వంటి ప్రాంతాల నుంచి ట్రాఫిక్‌ను ఛేదించుకొని పట్టణంలోని పురపాలక, నెహ్రూ మెమోరియల్, ప్రభుత్వ బాలికల పాఠశాలలకు రావాల్సి ఉంటుందన్నారు. దీంతో విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. శివారు ప్రాంతంలో విద్యార్థులకు అనుకూలంగా ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్టీయూ నాయకులు కె.ప్రహ్లాద్, లోక్యనాయక్, ఉరుకుందప్ప, మారయ్య, విజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఎక్కడో పుట్టి చదువులమ్మ గుడిలో ఒక్కటిగా కలసిమెలసి తిరిగారు, ఆడుకున్నారు. ఉద్యోగాల రీత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ తమ స్నేహాన్ని మరిచి పోకుండా ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో తమ బాల్య మిత్రులను కలుసుకున్నారు. వీరంతా పట్టణంలోని వైఎంకే పాఠశాలలో 2003లో పదో తరగతి చదువుకున్నారు. 20 సంవత్సరాల తరువాత అందరూ తిరిగి కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమం నిర్వహణ బాధ్యత తీసుకున్న మిత్రులు హరి, కిరణ్‌ను పలువురు అభినందించారు. 20 ఏళ్ల తరువాత తిరిగి కలుసుకోవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

ముమ్మరంగా 'ఆరోగ్య సురక్ష'

ఆదోని సెంట్రల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటి సర్వే చేస్తు ఉండగానే మరో పక్క అధికారులు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ప్రతి కుటుంబంలోని వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య వివరాలను మెబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి 45 రోజుల పాటు వైద్య శిబిరాలు నిరంతరాయంగా కొనసాగే విధంగా ప్రణాళికలను రూపొందించారు. రేపటి నుండి ఆదోని డివిజన్ పరిధిలోని 27 కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు డిప్యూటి డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి ఆదివారం తెలిపారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో 6 కేంద్రాలో వైద్య శిబిరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రేపు వైద్య శిబిరాల షెడ్యూల్

- ఆదోని మండలం ధణాపురం గ్రామ సచివాలయంలో డాక్టర్ సుశ్మిత పర్యవేక్షణలో వైద్య శిబిరం జరుగుతుంది.
- ఆదోని పట్టణం అరుణ్‌జ్యోతి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ మౌనిక పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కోసిగి–5 బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ నజీర్ అహ్మద్ పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కౌతాళం–3 విలేజ్ క్లినిక్‌లో డాక్టర్ పావని పర్యవేక్షణలో వైద్య శిబిరం
- పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం–1 అగ్రికల్చర్ సొసైటీలో డాక్టర్ శాంతిజ్యోతి పర్యవేక్షణలో వైద్య శిబిరం
- మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామంలో డాక్టర్ గోవిందమ్మ పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.


వైద్య పరీక్షలు చేస్తున్న ఎఎన్‌ఎం, ఆశావర్కర్లు

ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభం

కౌతాళం: స్థానిక సచివాలయం–3 పరిధిలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హాజరువుతున్నట్లు తెలిపారు. ఆరోగ్య సురక్ష ద్వారా రోగులకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.